వెన్నెల

వింధ్యవాసిని



శ్రీ సరస్వతీ ఆశ్రమం అంతా సద్దు మణిగింది.

ఆ రోజు జరగవలసిన కార్యక్రమాలన్నీ ముగిసాయి.

ఆశ్రమవాసులంతా ఎక్కడివారక్కడ నిద్రావస్థలోకి జారుకుంటున్న సమయం!

ఆశ్రమ ప్రాంగణం మధ్యలో ప్రముఖంగా కనిపించే ఒక కుటీరంలో మాత్రం ఇంకా దీపం వెలుగుతోంది. అది ఆశ్రమ సంస్థాపకురాలు, అధిపతి అయిన గురుశ్రీ రాజేశ్వరీదేవి నివాసం.

గదిలో ఒక ప్రక్కగా వెదురు బొంగులతో తయారుచేసిన మంచం కొబ్బరి పీచుతో కుట్టిన పలుచని పరుపు, దానిమీద జింక చర్మం పరచిఉంది. మంచంమీద కూచునిఉన్న రాజేశ్వరీదేవి చేతుల్లో మహాగ్రంథ మేదో ఉంది కానీ ఆమె దృష్టి పుస్తకంలో పేజీలు, అక్షరాల వరుసల మీద లేదు. మనసు ఇంకెక్కడో ఉంది.

పుస్తకాన్ని పక్కకున్న ముక్కాలి పీటమీదుంచి, లేచి, గదిలో అటూ ఇటూ పచార్లుచేయడం ప్రారంభించింది.

అయిదున్నర అడుగుల ఎత్తు, ఎత్తుకు తగిన శరీర సౌష్టవం, వయసు ఏభయి పైబడినా, నలభయ్యేళ్ళ మనిషంత దేహదార్ఢ్యంతో, ధరించింది కాషాయవస్త్రాలూ, రుద్రాక్షమాలా అయినా, సామ్రాజ్ఞిలా కనిపిస్తుంది రాజేశ్వరీదేవి. జుట్టు లేని తలకు ఎప్పుడూ కాషాయవస్త్రం ఒకటి గట్టిగా కట్టుకుని ఉంటుంది.

బయట వాతావరణం చల్లగా ఉంది. అయినా, బహుశా, ఆలోచనలతో ఆవిడ తల వేడెక్కి ఉండటంవల్లనేమో, చిరుచెమటలతో, ముఖాన ఉన్న విభూతి

రేఖలు, వాటి మధ్యని కుంకుమబొట్టు కొద్దిగా చెదిరిపోయిఉన్నాయి.

ఉదయం ఆశ్రమ సేవాదళం ముఖ్య సేవిక రంగమ్మ చెప్పిన మాటలు విన్న క్షణం నుంచీ ఆవిడ మనసుకు శాంతి లేకుండా అయింది.

మామూలుగా ఎప్పటిలాగే, గది ఊడ్చేందుకు వచ్చింది రంగమ్మ. రాజే శ్వరీదేవి కన్నా వయసులో పెద్దదీ, ఆశ్రమం ప్రారంభించిన నాటినుండీ ఆమె వెంట ఉన్నదీ అవటంవల్ల, రంగమ్మ అంటే ఆవిడకు కొంత ప్రత్యేక అభిమానం ఉన్నది

"అమ్మగారూ! చాలా రోజుల్నుంచీ మీతో ఒక మాట చెబుదామనుకుంటున్నా.. మీ కోపం వస్తుందేమోనన్న భయంతో నోరు పెగలకుండా ఉంది" అన్నది రంగమ్మ.

"ఇంత వయసు వచ్చి, నా కోపం తెప్పించేంత తప్పు ఏంచేశావు?"

"తప్పు చేసింది నేను కాదమ్మగారూ!"

"అయితే నీ కెందుకు భయం చెప్పు" అన్నది రాజేశ్వరీదేవి ప్రసన్నంగా.

"రూపాదేవమ్మ ప్రవర్తన బాగుండటం లేదమ్మా!" సంకోచంగా అంది రంగమ్మ.

"రంగమ్మా. ఏమిటి నువ్వంటున్నది?" ఆవిడకి అర్థంకావడంలేదు.

"నిజమేనమ్మా. నా మాటల మీద నమ్మకం కుదరకపోతే, ఏ రోజయినా రాత్రి పదిగంటల తర్వాత గుట్ట అవతల కాలవగట్టుకు వెళ్ళి చూడండి, మీకే తెలుస్తుంది."

రాజేశ్వరీదేవి నోటమాట లేకుండా ఉండిపోయింది.

అప్పటినుంచీ ఆవిడ మనసు మనసులో లేదు. నిజానిజాలు తెలుసుకోకుండా రూపను ప్రశ్నించటం, కోపగించి దండించడం ఆవిడ కిష్టంలేదు అందుకనే హృదయంలో తుఫాను రేగుతున్నా, సహించి, ఉదయంనుంచీ మౌనంగా ఉండిపోయింది.

ఒక్కొక్క ఘడియ గడుస్తున్న కొలదీ, రంగమ్మది ఒట్టి అనుమానం కాదు, నిజమే అయివుండాలి అన్న నమ్మకం బలపడుతోంది ఆమె మనసులో.

ఎందుకంటే రంగమ్మ అబద్ధాలు చెప్పే మనిషి కాదు ఉత్తినే అనుమానించే తత్వం అసలే కాదు. రూప విషయంలో అసలు పొరబాటు అనేది చేయదు.

ఎందుకంటే రూపాదేవి తన కెంతో, ఒక సేవికే అయినా రంగమ్మకూ అంతే! ఇంకా ఎక్కువేనేమో!

రంగమ్మ ఉన్న ఒక్కతే కూతురుకు అతిచిన్నవయసులో పెళ్ళిచేసింది. ఆ పిల్ల ఒక పాపను కని, మొదటి ప్రసవంలోనే మరణించింది. రంగమ్మ వెంట ఉన్న పసిబిడ్డ తనదయింది. రూపాదేవిగా ఆశ్రమంలో పెరిగింది. ఆ అమ్మాయికి రంగమ్మతో తనకున్న సంబంధం గురించి

తెలీదు. తెలిసే అవకాశమూ లేదు.

అంటే రంగమ్మ చెప్పిందంతా పూర్తిగా నిజమేనా?

ఎందుకట్లా అయింది? ఎక్కడుంది లోపం?

రూపను తను బుద్ధి వికసించకముందు నుండీ, ఎంత క్రమశిక్షణతో పెంచింది! తన తదనంతరం, ఈ ఆశ్రమం గురుపీఠాన్ని అధిష్ఠించవలసిన రూప ఇలా ఎందుకు చేస్తోంది? ఈ అపశ్రుతి ఎలా ఏర్పడింది?

దైవభక్తిని, సన్యాసాన్ని, తను రూపలో ఉగ్గుపాలతో రంగరించిపోసిందే! అవన్నీ ఏమయాయి? రూపకి బుద్ధి ఎందుకు పుట్టింది?

తెలిసీ తెలియని వయసు, అమాయకత్వం.... అవును అంతే! రూపాదేవి కావాలనే, తన్ను బాధించాలని, ఈ దొంగచాటు వ్యవహారం మొదలు పెట్టిందని అనుకోవడానికి, రాజేశ్వరీదేవి మనసు అంగీకరించటం లేదు.

అవును. అంతే అయి ఉంటుంది! తెలియక ఆమె పొరబాటు చేస్తే సరిదిద్దవలసిన బాధ్యత తనదే! ఆ మోసగాడెవరో, మంచి అనుభవశాలి ఏమో! లేనిదే ఆశ్రమం అధినేత అయిన, తన పెంపుడు కూతుర్నే వలలో వేసుకోవడానికి, వాడికి ఎన్ని గుండెలు కావాలి!

గోడనున్న పాత గడియారం హఠాత్తుగా గంటలు కొట్టటం ప్రారంభించింది.

అంటే పది గంటలయిందన్నమాట.

'ఇదేమిటో ఇవాళ తేలిపోవలసిందే, అనుకుంది రాజేశ్వరీదేవి. కాషాయ రంగు శాలువ ఒకటి తీసి భుజంచుట్టూ కప్పుకుంది. గంధపు చెక్కతో తయారుచేసిన, చేతికర్రను పుచ్చుకుని, పాంకోళ్ళు వేసుకుని, గది దాటి వెలుపలికి అడుగు పెట్టింది.

అంతటా నిశ్శబ్దంగా ఉంది. నాలు గడుగులు వేసి రూప గదిని సమీపించింది రాజేశ్వరీదేవి. మంచం మీద పడక నలగనే లేదు. గది ఖాళీగా ఉంది.

'హం! అయితే బయలుదేరి వెళ్ళిందన్నమాట!' అనుకొని అడుగేసింది రాజేశ్వరీదేవి.

ఆమె ఆలోచిస్తూ, పరిసరాలని పరిశీలిస్తూ, నడుస్తోంది.

సూర్యుడు లేనందువల్ల అది రాత్రి అయింది కానీ, ఎక్కడా చీకట్లు మాత్రం కనిపించటం లేదు పౌర్ణమి వెళ్ళిన రెండవ రోజేమో, చంద్రుడు, లోకమంతా నాదే అన్నట్లు, అంతటా వెలుగులు వింపుతున్నాడు.

ఆశ్రమం ఆవరణ దాటింది రాజేశ్వరీదేవి. గుట్ట వయిపుగా అడుగులు వేసింది. అదంతా ఆశ్రమం ఆస్తే. ఆశ్రమం అవసరాలకు, తగినంత మేరకు అక్కడ వ్యవసాయం జరుగుతుంది.

చిరుగాలికి కొద్దిగా కదులుతున్న, పంటచేలు, వెన్నెల వెలుగులో కొత్తగా కన్పిస్తున్నాయి. ఈ వెన్నెల, ఈ వాతావరణం అంతా ఏదో వింతగా అనిపిస్తోంది రాజేశ్వరీదేవికి.

అవును తను చంద్రుణ్ణి, వెన్నెలనూ చూసి ఎన్ని సంవత్సరాలయిందో గుర్తు లేదు. సూర్యోదయం కన్నా ముందు నుంచీ, సూర్యాస్తమయం వరకూ, క్షణం తీరుబాటు దొరకని దినచర్య ఆమెది. ఆశ్రమద్వారం దాటి వెలుపలికి రావటం అన్నదే అపురూపం. అలా అయినా, ఇంత రాత్రి అయిన తరువాత బయటికి రావలసిన అవసరం అసలు ఉండదు.

పంటచేలు దాటి గుట్ట ఎక్కడం వల్ల కొద్దిగా ఆయాసం అయి, నడక వేగం తగ్గిపోయింది.

ఏవో గడ్డిపూవుల సువాసనల్ని మోసుకొస్తున్న చిరుగాలులు, ఆమె శరీరానికి హాయిగా సేద దీరుస్తున్నట్లుగా ఉన్నాయి.

ఎక్కువ దూరం ఒక్కపట్టున ఎక్కలేకపోయింది రాజేశ్వరీదేవి. చదునుగా ఉన్న ఒక బండమీద చతికిలబడింది పరిసరాలను పరిశీలిస్తూ కూచుండిపోయింది.

చిత్రంగా ఆవిడ మనసులోని అశాంతి అంతా ఎటుపోయిందో, కాస్త తేలిక పడినట్లుగా ఉంది.

అక్కడినుంచి చూస్తే, ఆశ్రమం పర్ణశాలలు, అటువయిపు తోట, ఇటువయిపు పంట పొలాలు. అన్నీ వెన్నెల వెలుగులో, గొప్ప చిత్రకారుడు గీసిన ప్రకృతి చిత్రపటంలా కనిపిస్తున్నాయి.

వెన్నెల! ఎటు చూసినా వెన్నెల! చెట్టూ, పుట్టా, రాయి, రప్పా, అన్నిట్లో నిండిపోయి ఉంది. ప్రకృతి అంతా ఏదో రమణీయతను సంతరించుకున్నట్లుగా ఉంది.

ఈ వాతావరణం, ఈ వెన్నెల ఆనందాన్నిచ్చే ఇంత అందం, ఇవన్నీ ఎందుకు సృష్టించాడు దేవుడు? ఎవరికోసం? జీవకోటి సర్వస్వం, నిద్రావస్థలోకి వెళ్ళిపోయిన ఈ సమయంలో ఇంత ఆహ్లాదం వృధాకాదూ? దీన్ని అనుభవించేదెవరు?

ఒళ్ళుమరిచి నిద్రపోతున్న మనిషికి కారుచీకటి అయినా, వెన్నెలరాత్రి అయినా ఒకటే! అయితే చంద్రుడు వెదజల్లుతున్న ఈ చల్లని వెన్నెల ఎవరికోసం?

ఏమిటో! దైవలీలలే చిత్రం! ఎంత జ్ఞానం ఆర్జించినవారికయినా అర్థంకానివి ఉంటూనే ఉంటాయి.

రాజేశ్వరీదేవి సందేహానికి సమాధానం దొరకలేదు.

బండమీది నుంచీ లేచి ముందుకు సాగింది.

గుట్ట ఎక్కి దిగటం అయింది.

అక్కడినించీ అరటితోట ప్రారంభం. అరటితోటకి ఆవతలే చిన్నపిల్ల కాలువ ఒకటి ప్రవహిస్తోంది.

అరటితోట మధ్యనున్న చిన్న కాలిబాట వెంబడి నడుస్తోంది రాజేశ్వరీదేవి. ఆవిడ మనసులో ఇప్పుడు ఏ విధమయిన ఉద్వేగం, ఉత్సుకత లేవు.

అప్పుడప్పుడు గాలికి కదలుతున్న అరటి ఆకులు, చంద్రకిరణాల వెలుగులో తళుకులీనుతున్నాయి.

అరటితోట దాటగానే, అల్లంత దూరంలో, నిశ్శబ్దంగా ప్రవహిస్తున్న కాలువ కనిపించింది.

సంవత్సరానికి ఒక్కసారి ఈ కాలువ దగ్గరికి వస్తుంటుంది రాజేశ్వరీదేవి. శివరాత్రి వెళ్ళిన మరురోజు వచ్చి ఇక్కడ గంగాపూజ చేయిస్తుంది. శివరాత్రికి వారంరోజులు ముందరే తమ ఆశ్రమంలో ఆరంభంయ్యే పూజలు, ఉత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు తండోపతండాలుగా వస్తారు. తను పూజచేయవచ్చేసరికి, కాలువ గట్టు, సాన్నాలు చేసేవాళ్ళతో కిటకిటలాడుతుంటుంది.

ఏటా అదే జనసమ్మర్దంతో చూడటం వల్లనేమో, ఇవాళ నిర్మానుష్యంగా ఉన్న కాలువఒడ్డు, మేటలు వేసి ఉన్న ఇసుక, వింతగా కనిపిస్తున్నాయి రాజేశ్వరీదేవికి.

ఆమె కళ్ళు రూపకోసం వెతుకుతున్నాయి.

ఎక్కువసేపు వెతకనక్కరలేకపోయింది.

పాదాలు ఇసుకలో కూరుకుపోయినదానిలా, కదలకుండా నిలుచుండిపోయింది రాజేశ్వరీదేవి.

కాలువ కొద్దిగా ఒంపు తిరిగి దిగువకు ప్రవహిస్తున్న చోట రెండు బండరాళ్ళు ఒకదానికొకటి ఆనుకొని ఉన్నాయి వాటిమీద కూచుని ఉన్నారు రూప, ఆమె చెలికాడు.

వాళ్ళిద్దరూ ఈ లోకంలో లేరు.

కాళ్ళు నీటిలోకి వదిలి వాలుగా కూచుని ఉన్న అతని ఒళ్ళో తలపెట్టుకుని జారగిలబడి ఉంది రూప.

అతని చేతులు ఆమె జుట్టు సవరిస్తున్నాయి.

ఆమె చేతులు, అతని మెడచుట్టూ పెనవేసి ఉన్నాయి.

అదేపనిగా ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటున్నారు.

రాజేశ్వరీదేవికి కోపం రాలేదు: ఆశ్చర్యంగా చూస్తూ నిలుచుంది. అక్కడున్నది ఆమె ఊహించినట్లు కొమ్ములు తిరిన మగవాడు కాదు.

ఆ అబ్బాయికి రూప అంతే వయసు ఉంటుంది. మీసమయితే ఉంది కానీ, బుగ్గల్లో పసితనం కనిపిస్తోనే ఉంది.

ఓహ్! వాళ్ళిద్దరిలో ఎంత మైమరుపు! చూపుల్లో ఎంత ఆరాధన! వాళ్ళు చేస్తున్నది తప్పు అనుకోవడానికి రాజేశ్వరీదేవి మనసు వెనుకాడుతోంది.

ఒక్క నిముషం ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది.

మళ్ళీ కళ్ళుతెరిచిచూస్తే, ఎదురుగా ముఖాలకి బదులు మరేవో కనిపిస్తున్నాయి ఆమెకు!

అరె! అది తన ముఖంలాగే ఉంది, రూప వయసులో ఉండగా తన ముఖం అట్లాగే వుండేది! అవును అయితే.... అతను తనకు చిరపరిచితం అట్లాగే ఉండేది! అవును....అయితే....అతను .. తనకు చిరపరిచితం అయిన వ్యక్తే.... తనని ప్రాణంగా ప్రేమించిన పిచ్చి వాడు ... ఏమిటిది? ఇట్లా ఎందుకు కనిపిస్తోంది? ఎన్నేళ్ళుగా మరుగున పడిపోయిన, పాత జ్ఞాపకాలు ఇప్పుడు బయటి రావటం ఏమిటి?

కాదు కాదు! అక్కడున్నది తను కాదు. దృశ్యం మారిపోయింది. మళ్ళీ వాళ్ళిద్దరే కనిపిస్తున్నారు. ఏదో మాట్లా తున్నట్లు, వాళ్ళ పెదవుల కదలికలు తెలుపుతున్నాయి.

పిల్ల కాలువ, ఇసుకమేటలు, ఒక వయిపు, అరటితోట. గుట్ట మరొక వయిపు, వెన్నెల వెలుగులో అతి అకర్షణీయంగా ఉన్న ఆ ప్రకృతి దృశ్యంలో ఒక భాగంలా కలిసిపోయారు వాళ్ళిద్దరూ. నిజానికి వాళ్ళు, పరిసరాలకి మరింత అందాన్ని సమకూర్చుతున్నట్లుగా కని పిస్తోంది.

అతడు చంద్రుడివయిపు వేలు పెట్టి చూపి, రూపకేదో చెబుతున్నాడు. బహుశా 'చంద్రబింబం కంటే నీ ముఖమే అందంగా ఉంది' అంటూన్నా డేమో!

ఉహు కాదు, చేతిని గాలిలో చుట్టూ తిప్పి, రూప భుజానికి తాకించి,అదే చేతిని ఎదమీద ఉంచుకున్నాడు. "ఈ వెన్నెల వెలుగు, చల్లదనం అంతా మన కోసమే" అని అంటున్నటుంది.

అంతే అయిఉంటుంది.

అవును! తన సందేహానికి సమాధానం ఇప్పుడు దొరికింది. ఈ రాత్రి, ఈ వెన్నెల,ఈ అహ్లాదం అన్నీ, ప్రేమ భావంలో మైమరచి ఉన్న ఆ ప్రేమికుల కోసమే అయుండాలి!

రాజేశ్వరీదేవి మనసు మారిపోయింది.

నోరు విప్పి ఆ నిశ్శబ్దాన్నీ వాళ్ళ ఏకాంతాన్ని, భంగంచేయటం ఇష్టంలేక మౌనంగా వెనుదిరిగింది.

అశ్రమంలో గది చేరి విశ్రమించ బోయే ముందు 'ఉదయం, ఆ అబ్బా యెవరో వివరాలు తెలుసుకొమ్మని రంగమ్మకు చెప్పాలి' అనుకుంది రాజేశ్వరీదేవి.

అవును రూప తన కూతురు అయి నంత మాత్రాన, అమె భవిష్యత్తును నిర్ణయించే హక్కు తనకేం ఉంది! అందరి భవిష్యత్తులు నిర్ణయించే భగ వంతుడుండగా తనకెందుకా శ్రమ!